
సామాన్యంగా ఎవరికైనా పెళ్ళైన తరవాత మంచి ఉద్యోగం వస్తే పెళ్ళాం వచ్చినవేళ మంచిదనీ, పిల్లదాని అదృష్టం అనీ ఆ అమ్మాయి పరంగా చెబుతుంటారు. కాని మా సుబ్బారావు విషయంలో మాత్రం అందుకు భిన్నంగా ఉద్యోగం దొరికిన అదృష్టాన మంచి భార్య దొరికిందని చెప్పుకోవాలి. ఎందుకంటే అతనికి పిల్లనిచ్చిన మేనమామకు ఈ మేనల్లుడు సుబ్బారావుమీద మొదటి నుండీ అంత గొప్ప అభిప్రాయం లేదు. అతగాడు బి. కాం. లో చేరాడని తెలిసినపుడు కూడా తేలికగా, "ఆ, ఈరోజుల్లో డాక్టర్లకూ ఇంజనీర్లకే అంతంత మాత్రంగా ఉంటే ఈ బి. య్యేలూ, బి. కాం. లూ ఎందుకు పనికొస్తారు?" అంటూ తీసిపారేశాడు.

ఆ ధోరణి ఆయన అక్కగారు, అంటే సుబ్బారావు తల్లికి ఎక్కడలేని రోషం కలిగించింది. "పోనీలే నాయనా! వాడికేం, మగపిల్లాడు. వాడి కున్నదేదో వాడికి చాలు' అంది తనకొడుకు మగవాడన్న విషయం, వాడికి కొంత ఆస్తి ఉన్నదన్న విషయం గుర్తు వచ్చేలా.




అయితే అప్పట్లో అతడి మగతనం, ఆ ఆస్తీ కూడా తన ముద్దుల కూతురికి మొగుడయ్యేందుకు తగిన అర్హతలుగా ఆయనకి కనిపించలేదు.

పోతే, బి. కాం. అయిన మూడే మూడు నెల్లో సుబ్బారావుకు ఉద్యోగం రావడం, అదీ బ్యాంకులో గుమస్తా ఉద్యోగం రావడం అందరితోబాటు ఆయనకు కూడ ఆశ్చర్యం కలిగించింది. పెళ్లికొడుకుల కోసం అప్పటికే ఆయన చేసిన ప్రయత్నాల్లో బ్యాంకు గుమస్తా విలువేమిటో బాగా తెలిసింది. పదిసార్లు ఇంటిచుట్టూ తిరిగి పదివేల కట్నంతో ఆయన మేనల్లుణ్ణి అల్లుడుగా పొందగలిగాడు. మొదటేనుండీ తల్లీ కొడుకులు మోజుపడిన సంబంధమే కనుక ఎక్కువ బెట్టు చేయకుండానే వాళ్లు ఒప్పుకున్నారు. ఇవన్నీ అతను నాతో చెప్పిన విషయాలే.

పెళ్లికిముందు సుబ్బారావు ఆనందంచూసి నేను చాల సంతోషించాను. అతను బ్రహ్మచారిగా ఉన్న కొద్ది రోజులలోనూ మా కిద్దరికీ మంచి స్నేహం కుదిరింది. అతను వయసులో నాకంటే చిన్నవాడయినా ఆ వ్యత్యాసం మా స్నేహానికి ఏవిధంగానూ అడ్డం రాలేదు. అనేక విషయాలు నాతో చర్చిస్తూండేవాడు. యించుమించు ప్రతి ఆదివారం మా ఇంటికి వచ్చేవాడు. నా భార్యకూడ వచ్చినప్పుడల్లా అతణ్ణి భోజనానికి ఉండమని బలవంతంచేసి ఆదరిస్తూండేది. అతని అమాయకత్వం నిష్కల్మషంగా మాట్లాడే తీరు నన్ను బాగా ఆకర్షించేవి.

కొత్తగా కాపురం పెట్టిన రెండురోజులకే సుబ్బారావు సతీ సమేతంగా మా ఇంటికి వచ్చాడు. పెళ్లికి మేము వెళ్లలేకపోవడంవల్ల అదే ఆమెను చూడటం. ఆమెను చూసిన తర్వాత మరోసారి సుబ్బారావు అదృష్టాన్ని అభినందించకుండా ఉండలేకపోయాను. ఆమె వింతో అందగత్తె మాత్రమే కాదు చక్కటి వినయం, మాటల్లో తెలివితేటలూ, సంస్కారం — ఎవరికైనా ఆమెపట్ల మంచి అభిప్రాయాన్ని కలుగజేస్తాయి.

కొద్ది నెలలుగడిచిపోయాయి. అన్నాళ్లూ నేను ప్రత్యేకంగా గమనించకపోయినా, సుబ్బారావు ఉండవలసినంత ఉత్సాహంగా ఉండటంలేదని నాకే ఒకటి రెండు సందర్భాలలో తోచింది. మనిషిలో కొంత పరధ్యానం, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుండటం మొదలైంది.

ఒక రోజున అన్నాను వెళాకోళంగా, "ఏమిటోయ్! కొత్త పెళ్లికొడుకువి. అలా "డీలా" పడి ఉంటున్నావేమిటి? అప్పడేమీ సమాధానం చెప్పకుండా నవ్వి ఊరుకున్నాడు. తరవాత సాధ్యమైనంత సహజంగా ఉండటానికి అతను ప్రయత్నించేవాడు.

ఒక రోజున మేమిద్దరమే నడుచుకొంటూ షికారుగా చాల దూరం వెళ్లాం. పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్నాం. ఏదో మాటల ధోరణిలో అడిగాడు, "గురువుగారూ, ఏదైనా సినిమాలోగానీ, నిజంగాగానీ అందమైన ఆడవాళ్లను చూసినపుడు మనకు రకరకాల ఆలోచనలు కలుగుతాయి గదా! స్నేహితుల మధ్యనయితే మనం అటువంటి విషయాలు దాచుకోం కూడా. ఫ్రీగా మాట్లాడుకుంటాం. ఈ విషయంలో ఆడవాళ్ల తత్వాలు ఎలా ఉంటాయంటారు? ఎవరైనా అందమైన మగాళ్లను చూసినపుడు వాళ్లెలా 'ఫీల్' అవుతారు? మనంత విశృంఖలంగా వాళ్ల ఆలోచనలు కూడా పోతాయంటారా?"

చాలా పెద్ద ప్రశ్న అడిగాడు. ఆ విషయంలో నా పరిజ్ఞానం సంగతి ఎలా ఉన్నా అతనికి అప్పుడు అటువంటి సందేహం రావడం నా కాశ్చర్యం కలిగించింది. నాకు కావలసిన జవాబేదో అతని ప్రశ్న చెప్పినట్లనిపించింది. అతనికి సూటిగా సమాధానమివ్వకుండా, "అయితే మగాళ్లందరూ ఒకేలా ప్రవర్తిస్తారని ఎలా చెప్పగలవు? అందమైన ఆడవాళ్లను చూసినంత మాత్రాన అందరూ చలిస్తారనుకోవడం పొరపాటు. అలాగే ఆడాళ్లలోనూ అన్ని రకాలవాళ్లూ ఉంటారు. 'జనరల్'గా ఏదీ చెప్పలేం. అంతా వ్యక్తిగతం" అన్నాను.

"పోనీ అదలా ఉంచండి. మన సంగతే తీసుకోండి. మనం ఏమీ చెడ్డవాళ్లం కాము. కాని ఏదో ఒక సందర్భంలో మనకు పర స్త్రీ వ్యామోహం కలగటంలేదా? ఆంతమాత్రం మానసిక బలహీనత కూడా లేనివాళ్ల ఎందరుంటారు?"

తన ప్రశ్నల స్వరూపం ఇదమిద్ధంగా తేల్చకుండా ఏదో చర్చించాలని చూస్తున్నాడు. ఏదో సమాధానం యివ్వాలిగనుక, "ఆ మాత్రం బలహీనత ఉన్నా మనం చెడ్డవాళ్లం కాదనేగదా నీ ఉద్దేశ్యం? అటువంటప్పుడు అలాంటి భావాలు ఆడవాళ్లకు మాత్రం వస్తే తప్పేమిటి?" అన్నాను. ఆ తరువాత ప్రసంగం మరొక వైపుకు మళ్లింది.

సుబ్బారావు లాంటివాడు ఈ రకం ప్రశ్న అడగటం నాకు కొత్తగానే ఉంది. అదీ చాల 'సిన్సియర్'గానే అడిగాడని నా ఉద్దేశ్యం. అంతకు ముందెపుడైనా మా స్నేహితుల మధ్య సంభాషణల్లో అటువంటి సమస్యలు వస్తే సుబ్బారావే ముందుగా సమాధానాలు చెప్పేవాడు. ఇంచుమించుగా ఒక "స్టేట్‌మెంట్" ఉపన్యాస ధోరణిలో యిచ్చి ఉండేవాడు. ముఖ్యంగా స్త్రీ పురుష విషయాల్లో, అనుభవం లేనివాడైనా తనొక 'అథారిటీ' లాగే మాట్లాడేవాడు.

"బ్రహ్మచారిగాడివి. నీకీ విషయాలేం తెలుస్తాయి?" అని ఎవరైనా నవ్వితే,

"మాస్టారూ! విషయాలు తెలుసుకోవాలంటే అన్నీ అనుభవించే తెలుసుకోవాలటండీ? విస్తృతంగా చదవటం, హేతువాదంతో ఆలోచించటం, ఇవి ముఖ్యం." అనవాడు. కుర్రవాడు బాగా చదువుకున్నా డనిపించేటట్లు.

అందుకే మా సంభాషణనుబట్టి సుబ్బారావు మనఃస్థితిని అంచనా వేయడం కష్టం. కాని అతని బాధ ఏదో చూచాయగా అర్థమైనట్లనిపించింది. బహుశా తన భార్య తనకంటె అందగత్తె కావటం వల్ల "ఇన్ఫీరియారిటీ" కాంప్లెక్స్ కావచ్చు. ఆమెకు తనకంటె గొప్పవాడెవడి మీదనయినా ఇష్టం ఉందేమోనన్న అనుమానమో లేక కలగవచ్చుననో భయమో కావచ్చు.

కాని అతని మనోవ్యాధి అంతకంటె తీవ్రమైనదని తరవాత తెలిసింది. ఒక రోజు నేనూ, మా శ్రీమతీ, పిల్లలూ సినిమా కెళ్లాం.

సినిమా పాతది కావటంవల్ల జనం అంతగా లేరు. ఆట మొదలైన తరవాత మా వెనక వరసలో ఎవరో వచ్చి కూర్చున్నారు. గుసగుసగా మాట్లాడుకొనే మాటల్లోకూడ సుబ్బారావు కంఠ స్వరం పోల్చగలిగాను. ఇంటర్వెల్‌లో పలకరించవచ్చునని ఊరుకున్నాను. వద్దనుకున్నా వాళ్ల సంభాషణ మా చెవుల్లో పడుతోంది. ఏదో సన్నివేశంలో ఆమె, "అబ్బ! ఎంత బాగా చేశాడు?" అంది ఆ సినిమాలో హీరోని ఉద్దేశించి.

"బాగా చేశాడా? బాగున్నాడా?" అడిగాడు సుబ్బారావు.

"రెండూను" అంది ఆమె యధాలాపంగా.

"ఓహో! అయితే వాడు నీకు నచ్చాడన్న మాట. పాపం, నీకు అటువంటివాడు దొరికితే బావుండేది కదూ?"

"ఛ! ఛ! ఏం మాటలండీ? ఏదో ఏక్షన్ గురించి అంటే ఆదేం అర్థాలు తీయడం?"

"అర్థాలు తీయడం కాదు. అర్థాలు చెప్పడం అను. నీలాంటివాళ్ల సైకాలజీలన్నీ నాకు బాగా తెలుసు. ఏం చూస్తే ఏం అనుకొంటారో, ఎలా ఆలోచిస్తారో... ఆ! యింతకీ నీ సంగతి చెప్పు. నీకు అల్లా ఉన్నవాళ్లంటే మోజు కదూ! వాడు కాకపోతే అలాంటి మరొకడు..." పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. ఆమెకి కళ్లనీళ్ల పర్యంతమైనట్లుంది. ఏమీ సమాధానం కూడ చెప్పలేదు.

తరవాత విశ్రాంతి సమయంలో మమ్మల్ని చూసి కొంచెం కంగారు పడ్డట్లు కనిపించాడు. మేము మాత్రం ఏమీ తెలియనట్లే పలకరించాం. ఆ అమ్మాయిని చూస్తుంటే నాకు చాల జాలేసింది. నిష్కారణంగా ఇతని అనుమాన స్వభావానికి గురవుతున్నదని బాధ పడ్డాను.

ఈ మధ్య సుబ్బారావు రోజూ మధ్యాహ్నం 'రీసెస్' టైములో ఇంటికి వెళ్లివస్తున్నాడు. సామాన్యంగా ఆ కాస్సేపట్లో మే మెవళ్లం ఇళ్లకు వెళ్లం. కొత్త పెళ్లికొడుకు భార్యమీద 'విరహం'తో వెడుతున్నాడని అనుకొన్నాం. సినిమాహాల్లో సంభాషణ విన్న కొద్ది రోజులకే ఆ కారణం కూడ తెలిసిపోయింది.

ఆ రోజు మా యింట్లో ఏదో పేరంటానికి సుబ్బారావు భార్యనీ, వాళ్లుంటున్న యింటావిడనీ పిలిచి వచ్చిందిట నా భార్య. ఇంటావిడ ఒక్కర్తే రావడం చూసి, "శకుంతల రాలేదేమండీ?" అనడిగిందిట మా ఆవిడ.

**పైవారం**


# గెలుపు నాదే


**కొత్త సీరియల్**

"ఆవిడను పేరంటానికి కూడ రానిస్తాడటండీ వాళ్లాయన! ఇంకా నయం. ఇంట్లో పెట్టి తాళం మాత్రం వేయటంలేదు ఇప్పటివరకూ" అంటూ ఆవిడ చెప్పిన విషయాలన్నీ ఆ రోజు రాత్రి నా భార్య ద్వారా విని నిశ్చేష్టుణ్ణయాను. సుబ్బారావు అనుమానం సంగతి అందరికీ తెలిసిందన్నమాట. అతడి ఆంక్షలు ఎంతవరకూ వెళ్లాయంటే రోజూ ఇంటికి వచ్చే పాలవాడితోనూ, చాకలివాడితోనూ ఎందుకలా మాట్లాడతావని తిడతాడట. ఆ ముసలి యింటాయనా, ఆయన కొడుకూ కూడ అతని దృష్టిలో దోషులే. వాళ్లెపుడైనా ఆమెను పలకరిస్తే, "నువ్వు అందరికీ చనువివ్వకపోతే వాళ్లెందుకు నిన్ను పలకరిస్తా" రని ప్రశ్నించడం. ఆ మధ్య శకుంతల పినతల్లి కొడుకు ఏదో పనిమీద ఆ ఊరొచ్చి వాళ్ల యింటికి వచ్చాడుట. అతను రైలుకు బయలుదేరి వెళ్లేదాకా సుబ్బారావు ఇల్లు కదలలేదట. ఈ వివరాలన్నీ చెప్పి ఆమె, "ఏ మాట కామాటే చెప్పకోవాలండీ! ఆ పిల్ల మాత్రం చాల గుణవంతురాలు. మొదట్లో ఎంతో తెలివిగా సమాధానం చెప్పి ఇతణ్ణి మార్చాలని చూసింది. ఆ పాటి సరసం కూడానా ఈ మనిషికి" అంటూ బాధ పడిందిట.

ఇవన్నీ విన్న తరవాత సుబ్బారావు మనస్సు యింతగా అనుమాన పిశాచాని కెందు కెర అయిందా అని ఆలోచించసాగాను. నాకు అతనితో గల సన్నిహిత పరిచయాన్ని బట్టి ఆకారణం కొంతవరకు గ్రహించగలిగా ననుకొన్నాను.

అనేకసార్లు తను చదివిన సాహిత్యాలను గురించి చెప్పే సుబ్బారావు మాటలు మననం చేసుకొంటే జ్ఞాపకం వస్తున్నది. అతను చదువుకొనే రోజుల్లో తన రూములో ఒక స్నేహితుడితో కలసి ఉండేవాడట. ఆ స్నేహితుడు మహా శృంగార సాహిత్య ప్రియుడు. అంటే వివిధ రకాల సెక్స్ కథల పుస్తకాలతో రూము కళ కళ లాడుతుండే దన్నమాట. వద్దనుకుంటూనే ఆ కథా పారాయణం సుబ్బారావుకు కూడ అలవాటయింది. ఆ స్నేహితుడు అపుడపుడు తన అనుభవాలంటూ వశీకరణ రంగంలోని విషయాల నెన్నో వివరిస్తూండేవాడట. ఎంత తేలికగా ఆడవాళ్ల మనస్సులు హరించవచ్చో అతను చెబుతుంటే ఆ పుస్తకాలలో సంఘటనలు చదివిన సుబ్బారావుకు అదేమీ అసంభవం కాదనిపించేదట. ఆ రోజుల్లో మనిషి 'సుఖం' ఎలా అనుభవించివా




## కారణభూతం

తప్పు లేదన్న సిద్ధాంతం నచ్చేదట కాని సహజమైన పిరికితనం వల్ల ఏ ప్రయత్నాలూ చేయలేదన్నమాట.

పోతే అతను చెప్పే 'థియరీ' ఏమంటే, మనిషి ఏ విషయాలు చదివినా అందులో మంచిని గ్రహించ గలిగితే ఏమీ ఫరవాలేదని, ఇప్పుడు ఆలోచిస్తుంటే అనిపిస్తోంది. చదివిన విషయంలో మంచినే గ్రహించడం, చెడును వదిలిపెట్టడం అసాధ్యం కాదేమో గాని, ఆ వయసుకు ఆచరణ సాధ్యమా ?

అవినీతిని, అక్రమ శృంగారాన్ని పచ్చిగా వర్ణిస్తున్న పుస్తకాలను ఎవరైనా ఎందుకు చదువుతారు ? దాని చివర చెప్పబడే ఒక నీతికోసమా ? మనుష్యుల ప్రవర్తనపట్ల అవి ఏర్పరచే భావాలు అందరినీ ఆ దృష్టితో చూడ్డం అలవాటు చెయ్యవా?

సందేహం లేదు. అదే బాగా చదివాడు — విచ్చలవిడి శృంగార కథలు. బావగార్లతోనూ, భర్త స్నేహితులతోనూ శృంగారం సాగించేవాళ్లూ, పని వాళ్లతో సంబంధం పెట్టుకొనేవాళ్లూ... అతని దృష్టిలో ఎన్ని రకాల కల్పిత పాత్రలలో యువతీ లోకం దర్శన మిస్తున్నదో! ఆ విష బీజాలు మొలకలెత్తి అతని జీవితం మీద ప్రభావం చూపుతున్నాయంటే నమ్ముతాడా? ఎలా అతని దృష్టి మార్చడం ?

ఒకసారి అతను ఆఫీసు టైములో బయలు దేరుతుంటే నేను కూడ ఏదో పని ఉన్నట్లు లేచి,

"ఎక్కడికోయ్ సుబ్బారావ్ ?" అడిగాను.

"ఇంటికే సార్" అన్నాడు.

"ఈ వేళ మహా బోరుగా ఉందోయ్. నేను కూడ వస్తాను పద. మా చెల్లెలు చేతి కాఫీ రుచి చూడాలి." ఆ మాటకు అతను మామూలుగా అయితే చాల సంతోషించాలి. లేని నవ్వు తెచ్చిపెట్టుకొని, "కాఫీకి కాదులెండి. అయినా మీరు వస్తే కాఫీ కేం భాగ్యం ? రండి" అన్నాడు.

ఇంటికి వెళ్లడంతోనే నేను సైకిలు చైను ఊడినట్లు ఏదో సరిచేస్తూ కొంచెం వెనక ఆగాను. అతను వెళ్లి కిటికీలోనుంచి లోపలకు చూసి తరవాత తలుపు తట్టాడు. అతని భార్య వచ్చి తలుపు తీసి లోనికెళ్లిపోయింది. నన్ను రమ్మని పిలిచి కూర్చోబెట్టాడు.

"ఇప్పుడు కాఫీ కేం ఇబ్బంది పెట్టకోయ్. మనం హోటలుకి పోదాం. నీ పని చూసుకొని వచ్చెయ్" అన్నాను.

"అలాగే" నని రెండు నిమిషాలు లోపలికి వెళ్లి తిరిగి వచ్చాడు, "రండి సార్...పోదాం..." అంటూ.

హోటల్లో కూర్చున్న తరవాత, గొంతు సవరించుకొని అన్నాను.

"సుబ్బారావ్! నిన్నొక విషయం అడగాలను కొంటున్నాను. నీ వ్యక్తిగత విషయాలలో కలుగ జేసుకొంటున్నానని ఏమీ అనుకోకపోతే అడుగుతాను."

"అదేమిటి మేస్టారూ! మీరంటే నా కెంత గౌరవమో ఎలా చెప్పను ? మీతో స్నేహం కలిగి ఉన్నందుకు నేను గర్విస్తుంటాను అడగండి" అన్నాడు.

"అయితే చెప్పు. కారణం లేకుండా ఎవరినైనా అనుమానించడం అన్యాయం కాదూ ? అవమానించడం అమానుషం కాదూ ?"

అతని ముఖం ఎర్రబడింది.

"ఏ విషయం సార్ మీరంటున్నది ?"

"ఏ కారణం వల్ల నేనుకూడ మీ యింటికి రావడానికి భయపడుతున్నానో ఆ విషయమేనోయ్."

"మీరు మా యింటికి రావడానికి భయపడు తున్నారా ? అది నిజంగా నా దురదృష్టం సార్. కలలో కూడ నాకు మీమీద ఏ అనుమానమూ లేదు" బాధపడ్డాడు.

"మరి అందరికంటె నీకు ఆత్మీయురాలైన వ్యక్తిమీద అనుమానానికి ఆమె ఏ పాపం చేసుకుందోయ్ ? సూటిగా అడుగుతున్నాను. నువ్వు ఎందుకు రోజూ అన్నిసార్లు యింటికి వెళ్లివస్తున్నావ్ ? నీ గురించి ప్రక్కవాళ్లు ఏమనుకొంటున్నారో గ్రహించావా ?"

"మేస్టారూ ! నాకేవో కొన్ని అనుమానాలున్న మాట నిజమే. కాని నేను శుద్ధ మూర్ఖుడిని కాదు సార్ ! నా కారణాలు నా కున్నాయి."

"నన్నొక ఆత్మీయుడిగా భావించి ఆ కారణాలు ఏవో చెప్పగలవా ? శకుంతలను నువ్వెంతగానో ప్రేమిస్తున్నావని నాకు తెలుసు. అంతగా నిన్నామె ప్రేమించడం లేదేమోనని నీ అనుమానం. అవునా? నువ్వు యింట్లో లేనపుడు ఆమె ఎలా ప్రవర్తిస్తుందో నన్న అనుమానం నిన్ను అనుక్షణం బాధిస్తుంది. కాదూ ?"

"ఆ విషయం నిర్ధారించుకోవటం తప్పంటారా ?" అడిగాడు.

"అనను. అసలు అలా అనుమానించడానికి ఆధారాలుండాలిగదా ?"

"నేను సైకాలజీ గురించి బాగా తెలుసుకున్నా ననే అనుకొంటున్నాను మేస్టారూ ! నాకు మంచి ఉద్యోగం వచ్చేదాకా అసలు శకుంతలను యిచ్చే ఉద్దేశ్యమే లేదు వాళ్ల నాన్నకు. ఎన్నో సంబంధాలు చూశాడు. ఆమె నన్నే చేసుకుంటాననీ ఏమీ పట్టుపట్టలేదు. అటువంటప్పుడు ఆమె నన్నే ప్రేమిస్తున్నదని ఎలా అనుకోగలను ? అయినా నేను వూరకే పరీక్షిస్తున్నానుగాని ఆమెనేమీ అన్యాయం చెయ్యటంలేదుగదా ?"


"అన్యాయం చేయటంలేదా ? నువ్వు యింటిమీద సాగించే 'మెరుపు దాడు'ల ఉద్దేశ్యం ఆమె గ్రహించలేదనుకున్నావా ? నువు చేసే ప్రతీ పరీక్ష యితరుల దృష్టిలో పడుతుందని గ్రహించలేవా ?"

"ఎవరైనా ఏదో అనుకుంటారని మనస్సును సరిపెట్టుకోకుండా ఎలా వుండమంటారండీ ?"

"నీమీద ఆమె కెంత ప్రేమ వుందో ఎలా నిర్ధారణ చేసుకోగలవోయ్? నీకేదో పెద్ద సైకాలజీ తెలుసని నువ్వు అనుకొంటున్నావ్. కాని అదంతా నువ్వు చదివిన పుస్తకాలు నీలో కలిగించిన అభిప్రాయం తప్ప వేరుకాదు. నువ్వు జీవితాన్ని ఏం చూశావోయ్ ? ఏ స్త్రీ కోసమైనా నువ్వు ప్రయత్నించావా ? ఆడది అంత తేలికగా మగవాడికి లొంగిపోతుందన్న అభిప్రాయం తప్ప నీకు తెలిసిన సైకాలజీ ఏమిటో నాకు తెలీటంలేదు."

(34 వ పేజీ చూడండి)

భారత దేశంలో ప్రప్రథమంగా
తాజా కోడిగుడ్లతో
తయారుచేయబడుచున్న
ఫిన్స్ ఎగ్‌పౌడర్




- 'పాస్చరైజ్' చేయబడి, దానిలోని హానికరమైన బాక్టీరియా క్రిములు నిర్మూలింప బడుటవలన ఎప్పుడూ తాజాగా ఉంటుంది.
- తాజా కోడిగ్రుడ్డులోని రుచి పోషకపదార్థాలు, మాంసకృతులు విటమిన్లు, యథాతథంగా పదిల పరచబడతాయి.
- ఒకటి లేక రెండు చెంచాల పొడిని పాలలో కలిపి తాగితే అధిక శక్తిని ఉత్సాహాన్ని చేకూర్చుతుంది.
- ఆమ్లెట్లు, కేకులు మొదలైన వంటకాలేకాక, పొడిరూపంలో అన్ని పిండి వంటలలో వాడవచ్చును.
- సులభంగా జీర్ణమయే బలవర్థక, సంపూర్ణపోషకాహారం.
- చిన్న పిల్లల యొక్క, గర్భిణీస్త్రీల యొక్క నిరంతర పౌష్టికాహార సమస్యను ఎంతగానో తీర్చగల సంపూర్ణ ఆహారం.

A product of FOODS AND INNS LTD, BOMBAY

Distributors for South India:

**foodlinks**

*H.O.* Eluru Road, Vijayawada-520002 (A.P)

*Branches at:*

No.3-5-883, Old MLA Quarters Road, Hyderabad-500029

No. 101, 3rd Cross, Gandhinagar, Bangalore-560009

No. 43, Sir Theagaraya Road, Madras-600 017


## కారణభూతం

(20వ పేజీ తరువాయి)

సుబ్బారావు మాట్లాడలేదు.

"నీచమైన ప్రవర్తన గురించీ అసహజమైన, అసభ్యమైన సన్నివేశాలను గురించీ చదివి, మనిషి నైతిక విలువల గురించి చాల తేలిక అభిప్రాయం నీలో ఏర్పడిందని నేనంటాను. లేకపోతే ఆ అమ్మాయి గురించి చెడ్డ అభిప్రాయం ఎవడికైనా కలుగుతుందా ? నీ జీవితం వెలిగించటానికి దేవుడిచ్చిన వరమోయ్ ఆమె."

సుబ్బారావు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ప్రేమించని వాడు ఏడవలేదు. అనుమాన సౌధం మాటలతో కూలిపోతుందని నేను అనుకోలేదుకానీ, కల్పించుకున్న అనుమానాలు మొదట్లోనే కరిగిపోకపోతే అవే పెనుభూతాలు అవుతాయని నాకు తెలుసు. మాట్లాడటంతప్ప నేను చేయగలిగింది కూడా లేకపోవటంచేత ఉపన్యాస ధోరణిలోనే అన్నాను, "నీ ప్రవర్తనవల్ల ఆమె ఎంత అవమానం సహిస్తోందో తలచుకొంటే నిన్ను క్షమించకూడదనిపిస్తోంది. జీవితంమీద ఆమెకున్న ఆశల్ని విశ్వాసాన్ని నువ్వు నాశనం చేస్తున్నావు. నీ తప్పు నువ్వు ఆలస్యంగా తెలుసుకొంటే ఆమె కోల్పోయిన ఆనందాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ తిరిగి యివ్వగలవా ? ఆఖరుగా ఒక విషయం చెపుతున్నాను. నాకు తెలిసిన ఒక మహానుభావుడు తన అనుమానాలతో భార్యను నిరంతరం వేధించేవాడు. ఆ బాధలు పడలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆ తరువాత ఆయనపడ్డ ఆవేదన చూసి హృదయం ద్రవించేది. ఇప్పటికే ఆలస్యం కాకపోతే యికనైనా నువ్వు మారాలని నా కోరిక. మా చెల్లెల్ని సంతోష పెట్టడం నీ బాధ్యత."

మాటలు రానివాడిలా కూర్చుండిపోయాడు సుబ్బారావు. కాస్సేపుండి "వస్తాను సార్" అంటూ యింటికెళ్ళిపోయాడు.

మర్నాడుదయం ఆఫీసులో సుబ్బారావు నెల్లాళ్ళ శలవు పెట్టాడని తెలిసింది. నాకు కొంచెం ఆందోళన కలిగింది. సుబ్బారావునీ, శకుంతలనీ ఆనందమైన జంటగా చూడాలన్న నా కోరికతో నేనే బాధ్యత తీసుకొని కొంచెం తీవ్రంగానే మాట్లాడానేమో ! సాయంత్రం మేమిద్దరం వెళ్ళి ఒకసారి చూసిరావాలనుకొన్నాను.

కాని నేను వెళ్ళనవసరం లేకపోయింది. సాయంత్రం యింటికెళ్ళేసరికి సుబ్బారావూ శకుంతలా మా యింట్లోనే వున్నారు.

"మీ సుబ్బారావుగారూ శకుంతలా కొన్నాళ్ళపాటు వూళ్ళు తిరిగి వస్తారటండీ ! మీతో చెప్పి పోదామని వచ్చారు" అంది మా ఆవిడ. శకుంతల సిగ్గుపడుతూ నిల్చునివుంది.

నా మనస్సులోనే వాళ్ళిద్దరినీ ఆశీర్వదించాను.